www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 22 జూన్ 2025
5
తిరుపతి



గ్రావెల్ మాఫియాని అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో గ్రావెల్ మాఫియాను అరికట్టడంలో పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆరోపించారు. ఎవరైనా వారిని అడ్డుకుంటే దాడి చేయడం, బెదిరించడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సహజ వనరుల దోపిడీ తీవ్రంగా జరిగిందని చెప్పిన కూటమి నాయకులు నేడు అదే బాటలో దోపిడి చేస్తున్నారన్నారు. ఈ దోపిడీని సిపిఎం పార్టీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమైనారని సిపిఎం భావిస్తోందని తెలిపారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది పార్టీ పెద్దలకు వత్తాసు పలకడం సరికాదన్నారు. ఈ మాఫియాను అరికట్టకపోతే సిపిఎం పార్టీ రంగంలోకి దిగి ఆ భూములను ప్రజలకి పంపిణీ చేస్తుందని తెలియజేశారు. అధికార యంత్రాంగం డబ్బు మత్తు నుంచి బయటపడి ప్రజా సంపదను కాపాడాలని డిమాండ్ చేశారు.



పొలిమేరల్లో.. డ్రగ్స్ పొలికేక..!

ప్రజాశక్తి శ్రీకాళహస్తి

- మత్తులో చిత్తవుతున్న యువత
- పోలీసులకు సవాల్‌గా డ్రగ్స్ మాఫియా

ఆధ్యాత్మిక పట్టణం శ్రీకాళహస్తిని డ్రగ్స్ భూతం వెంటాడుతోంది. పట్టణ పొలిమేరల్లో డ్రగ్స్ మాఫియా పొలికేకలు పెడుతోంది. మద్యం.. గంజాయి.. గుట్కా.. డ్రగ్స్.. పేర్లు ఏమైనా అవి యువతను పెడదోవ పెట్టిస్తున్నాయి. మత్తుకు బానిసలుగా చేసి వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో గంజాయి వినియోగం బాగా పెరిగింది. దీనికి తోడు పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్న గంజాయి కొన్నిసార్లు పోలీసులకు చిక్కుతున్నా సింహభాగం మత్తు మాఫియా చేతుల్లోకి వెళుతోంది. ఈ పరిస్థితుల్లో చాపకింద నీరులా కొందరు అక్రమార్కులు కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల శ్రీకాళహస్తి పట్టణ పొలిమేరల్లో వెలుగు చూసిన గంజాయి విక్రేతల అరెస్టులతో డ్రగ్స్ మాఫియా కార్యకలాపాలకు వెలుగు చూస్తున్నాయి. అంతేకాకుండా యువత నార్కోటిక్ మందులను కూడా వాడుతున్నట్లుగా తెలుస్తోంది. మత్తు మాఫియా మూలాలను కనిపెట్టేందుకు శ్రీకాళహస్తి పోలీసులు చేస్తున్న విశ్వ ప్రయత్నాలు కొంతమేరకే ఫలిస్తున్నాయని చెప్పాలి.

● యువత, విద్యార్థులే లక్ష్యం

ఇన్నాళ్ళూ నగరాలకే పరిమితమైన మత్తు మాఫియా నేడు పట్టణాలకు, పల్లెలకూ పాకింది. యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు గంజాయి, పలు రకాల మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారు. పట్టణ పొలిమేరల్లో ఈ తంతు గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. 14 నుంచి 19 ఏళ్ల వయసు వారికి ఎక్కువగా మత్తు పదార్థాలను అలవాటు చేయిస్తున్నారు. వీరిలో పేద, మధ్య, ధనిక అన్న తేడా ఏమీ లేదు. మత్తుకు బానిసైన యువత, విద్యార్థులు గ్యాంగ్ వార్‌లకు దిగుతున్న పరిస్థితి కూడా ఉంది. గత ఏడాది డిగ్రీ విద్యార్థుల మధ్య జరిగిన ఓ గ్యాంగ్ వార్‌లో ఓ విద్యార్థి హత్యకు గురయ్యాడు. గంజాయి మత్తులో వారు కొట్టుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. వారం రోజుల క్రితం పట్టణ వన్ టౌన్ పరిధిలో ఓ ఇంటర్ విద్యార్థిపై గంజాయి సేవించిన కొందరు యువకులు దాడికి దిగారని



బాధిత విద్యార్థి తండ్రి ఆరోపణ. రెండు రోజుల కిందట టూ టౌన్ పరిధిలోని ఎస్డీకే నగర్ ప్రాంతంలో కొందరు యువకులు మద్యం, గంజాయి సేవిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో యువకులు పరారయ్యారు. ఘటనా స్థలంలో పోలీసులకు మైక్రో సిరంజ్‌లు, నీడిళ్ళు, గంజాయి బీడీలు, మందు బాటిళ్లు, నార్కోటిక్ అనుబంధ మందులు పడిఉండటంతో అవాక్కయ్యారు. ఈ ప్రాంతంలో ఎన్నో రోజులుగా ఈ తంతు సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో, మరుగు ప్రదేశాల్లో, విద్యా సంస్థలకు వెళ్లే దారుల్లో యువత, విద్యార్థులు గుంపులు గుంపులుగా ఏర్పడి మత్తు పదార్థాలు సేవిస్తున్నట్లుగా పట్టణమంతా చర్చ నడుస్తోంది.

● పోలీసులకు సవాల్‌గా డ్రగ్స్ మాఫియా

గత రెండేళ్ల కాలంలో శ్రీకాళహస్తి ప్రాంతంలో గంజాయి విక్రయాలు పెరిగాయి. శ్రీకాళహస్తి ప్రాంత పోలీస్ స్టేషన్లలో నమోదైన గంజాయి కేసులే దీనికి నిదర్శనం. రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్, వన్ టౌన్, టూ టౌన్ పరిధిలో పదుల సంఖ్యలో గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల కాలంలో టూ టౌన్ పరిధిలో అంతర్రాష్ట్ర గంజాయి ముఠాని పోలీసులు అరెస్టు చేశారు. భారీగా గంజాయి ప్యాకెట్లను స్వాధీన పరుచుకున్నారు. సరిహద్దులను, పొలిమేరలను కాచుకొని పోలీసులు ఎక్కడికి అక్కడ గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అయినా ఏదో ఒక దొడ్డి దారిన మత్తుమాఫియా పోలీసులకు సవాలు విసురుతూనే ఉంది. మత్తు మాఫియాపై పోలీసు ఉన్నతాధికారులు ఉక్కు పాదం మోపి యువతను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జీవనవిధానంలో యోగా భాగం కావాలి

: జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

యోగాతో సామాజిక రుగ్మతల నుండి బయటపడాలి : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రజలందరికి జీవనవిధానంలో యోగా ఒక భాగం కావాలని, చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక ఎస్వీ యూనివర్సిటీ తారకరామ స్టేడియంలో ఏర్పాట్లు చేసిన 11వ ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి ఎస్వీయు, వేదిక్ వర్సిటీ విసిలు ఆచార్య అప్పారావు, సదాశివ మూర్తి,మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిఆర్ఓ నరసింహులు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, పర్యాటకశాఖ ఆర్డి రమణ ప్రసాద్, వివిధ యూనివర్శిటీలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు, అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర–2025లో 10 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా 11వ అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని 6200 ప్రాంతాల్లో సుమారు 9 నుంచి 10 లక్షల మంది పాల్గొంటున్నారన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నెల రోజులపాటు జిల్లాలో ఒక ఉద్యమంలా యోగాంధ్ర కార్యక్రమాల్ని నిర్వహించామన్నారు. ఒత్తిడి దూరం చేసుకునేందుకు యోగ దోహదపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ ప్రజలందరూ యోగా చేసేలా చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ మాస్టర్ క్రాంతి ఆధ్వర్యంలో స్టేడియంలో హాజరైన అందరితో యోగాసనాలు వేయించారు.

స్పిరి ప్యాకింగ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం



ప్రజాశక్తి- సత్యవేడు (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా, సత్యవేడు మండలం పాలగుంట గ్రామం వద్దనున్న స్పిరి ప్యాకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రెండు గంటల పాటు మంటలు భారీ ఎత్తున చెలరేగడంతో పరిశ్రమ పరిసర ప్రాంతాల గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న జిల్లా అగ్ని మాపక అధికారి రమణయ్య సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే పరిశ్రమకు చెందిన భారీ యంత్రాలు, ముడి పదార్థం, పైకప్పు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.25 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు పరిశ్రమ యాజమాన్యం తెలిపింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని యాజమాన్యం తెలిపింది. ఈ ప్రమాదంపై మరింత స్పష్టత రావాల్సి ఉందని, ప్రమాద సమయంలో ఈ పరిశ్రమలో 60 మంది కార్మికులు ఉన్నారని, గత రెండు రోజులుగా యంత్రాలు ఆపివేసి శుభ్రపరిచే పనిలో ఉన్నట్లు తెలిపారు. మంటలు చెలరేగిన వెంటనే కార్మికులు అప్రమత్తమై బయటికి పరిగెత్తడంతో ఎలాంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదని తెలిపారు. స్పిరి ప్యాకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ 2023వ సంవత్సరంలో ప్రారంభమయింది. ఈ పరిశ్రమలో టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటి వస్తువుల ప్యాకింగ్‌కు ఉపయోగించే కార్డ్ బోర్డ్ పార్సెల్ ప్యాకింగ్ నమూనాలను ఉత్పత్తి జరుగుతుంది. ఈ పరిశ్రమలో దాదాపు మూడువందల మంది కార్మికులు పనిచేస్తున్నారు. గత రెండు రోజులుగా యంత్రాలు ఆపి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన స్థలాన్ని జిల్లా అగ్ని మాపక అధికారి రమణయ్య పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ యాజమాన్య నిర్వహణ లోపం స్పష్టంగా కనబడుతోందన్నారు. ఈ పరిశ్రమలో అగ్నిమాపక నిరోధకాలు ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించటం పట్ల పరిశ్రమలోని కార్మికులకు అవగాహన లేకపోవడంతో భారీ అగ్ని ప్రమాదం వాటిల్లిందని, యాజమాన్యానికి పెను నష్టాన్ని మిగిల్చిందన్నారు. సాధారణంగా ఏ పరిశ్రమంలోనైనా ఉత్పత్తిని వేరొక ప్రదేశానికి తరలించి అక్కడ ప్యాకింగ్ నిర్వహిస్తారని అయితే ఈ పరిశ్రమకు ఉత్పత్తి యూనిట్ లోపలే ఉత్పత్తి నిల్వలను ఉంచి వాటికి ప్యాకింగ్ నిర్వహించడం ప్రమాదంలో మరింత నష్టం తెచ్చిందన్నారు. ఉత్పత్తిలో వెలువడే వ్యర్థాలను వెంటనే తొలగించడం, దూరంగా వేయకపోవడం వంటివి ప్రధాన లోపమన్నారు. పరిశ్రమ యాజమాన్య నిర్లక్ష్యం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై ఏనాడు కూడా కార్మిక శాఖ దృష్టి సారించిన సందర్భాలు లేకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సత్యవేడు మండల తహశీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ సురేష్ వీఆర్వోల బృందంతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఇకపై ఎఫ్‌సీ జారీకి నూతన టెక్నాలజీతో పరీక్ష

- శ్రీకాళహస్తి వద్ద నిర్మితమవుతున్న ఏటిఎస్ కేంద్రం
- నూతన టెక్నాలజీతో ఎఫ్ సీలు:ఆర్టీవో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

రవాణా శాఖలో దశాబ్దాల కాలంగా అధికారి నేరుగా వాహనాలను పరీక్షించి వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్రాన్ని (ఎఫ్ సీలు) ఇచ్చేవారు. ఇకపై మానవ రహిత వాహన ఎఫ్‌సీలు జారీ చేయబడునున్నాయని ఇందుకోసం నూతన టెక్నాలజీని వినియోగించనున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ప్రజాశక్తికి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వాహనాలకు ఎఫ్‌సీలు నిర్వహించడానికి రవాణా శాఖ నుండి ఒక ఎంవిఐ ప్రత్యేకంగా విధులు నిర్వహించాల్సి ఉన్నది. ఇప్పటివరకు ఇలానే అధికారి నేరుగా ఎఫ్ సీ కోసం వచ్చిన వాహనాలకు బ్రేకులు, లైట్లు, టైర్లు, వాహన సస్పెన్షన్లు, స్టీరింగ్ అన్ని నాణ్యత వినియోగంలో ఉన్నాయా లేవా అనే అంశాలను పరిశీలించేవారన్నారు. వీటితోపాటుగా ఆయా వాహనాలలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, అత్యవసర ద్వారం కూడా ఎంవిఐ పరిశీలిస్తారన్నారు. అయితే మూడు నెలల తర్వాత అందుబాటులోకి రానున్న ఆటోమేటెడ్ టెస్ట్ స్టేషన్‌లో టెక్నాలజీ ద్వారా వాహనాలకు సంబంధించి ఎఫ్ సీలు నిర్వహించబడతాయన్నారు.

శ్రీకాళహస్తి తొండమానుపురం వద్ద..

రవాణా శాఖ నుండి జారీ అయ్యే వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్రం (ఎఫ్‌సీ)లు ఇకపై శ్రీకాళహస్తి నియోజకవర్గం రూరల్ పరిధిలోని తొండమానుపురం వద్ద నూతనంగా నిర్మితమవుతున్న ఆటోమేటెడ్ టెస్ట్ స్టేషన్ నుండి జారీ అవ్వనున్నాయి. ఈ ఆటోమేటెడ్ ట్రస్ట్ స్టేషన్ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. వచ్చే మూడు నెలల తరువాత వాహనాలకు సంబంధించి ఎఫ్‌సీ కోసం అన్ని రకాల వాహనాలు ఇక్కడకు చేరుకుని ఎఫ్‌సీలు పొందాల్సి ఉంటుందన్నారు.



జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్

శ్రీకాళహస్తి తొండమానుపురం వద్ద నిర్మితమవుతున్న ఆటోమేటెడ్ టెస్ట్ స్టేషన్

'వెంకటరమణ'లో మీ గుండె పదిలం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: గుండె జబ్బులకు 'వెంకట రమణ హార్ట్ అండ్ గైనకాలజీ' సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాదునిక వైద్య సౌకర్యాలు అందిస్తున్నట్లు ఆ ఆసుపత్రి అధినేతలు డాక్టరు సి.వెంకటరమణ, డాక్టరు నిరుపమా తెలిపారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని వారి ఆసుపత్రి ఆవరణంలో 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ గుండె మానవ శరీరంలోనిన అన్ని అవయవాలకు రక్తం సరఫరా చేస్తుందన్నారు. కణాలన్నింటికి రక్తం ద్వారా ఆక్సిజన్, ఇతర పోషకాలను అందిస్తుందని తెలిపారు. విరామం లేకుండా తన సేవలను గుండె అందిస్తుందన్నారు. ఈ క్రమంలో గుండె పలుమార్లు తీవ్ర ఒత్తిడికి గురవుతుందన్నారు. గుండె కవటాలు, గుండెలోని కరెంటు వ్యవస్థ, పెరికార్డియం (గుండెపై ఉండే పొర), కరోనరీ రక్తనాళాలు (గుండెకు రక్తాన్ని అందించే రక్త నాళాలు) వంటి వాటిలో ఇబ్బందులు ఉంటాయన్నారు. గుండె కండరాలకు రక్తం సరఫరా ఆగిపోవడాన్నే గుండెపోటుగా చెబుతారు. గుండెకు సంపూర్ణ వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలతోఆరోగ్యంగా ఉండొచ్చన్నారు.

గుండెజబ్బులపై అశ్రద్ధ వద్దు

గుండె జబ్బులపై ప్రజలు అశ్రద్ధచేయవద్దు. చాలా మంది తమకు గుండె నొప్పి లక్షణాలు ఉన్నా.. వాటిని పెద్దగా పట్టించుకోరని, సమీపంలోని చిన్న చితకా ఆసుపత్రులకు వెళ్లి, గ్యాస్ట్రిక్ సమస్యకు సంబంధింన చికిత్స తీసుకుని అశ్రద్ధ చేస్తుంటారు. సుమారు 8 నుంచి 12 గంటలపైగా నొప్పిని అనుభవించిన తర్వాత సంబందిత గుండె వైద్యులను సంప్రదిస్తారు. ఇది సరైనది కాదు. గుండె నొప్పి వచ్చిన 6 గంటల తర్వాత గుండెకు సంబంధించిన సుమారు 90శాతం బాగంగా డ్యామేజీ అవుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని గుండె జబ్బులపై అశ్రద్ధ చేయకుండా వెంటనే సంబంధిత నిపుణులను సంప్రదిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

గుండెపోటు లక్షణాలు..

చాతి మద్య బాగంలో అసౌకర్యంతో కూడిన ఒత్తిడి, బరువుగా ఉన్నట్లు, మెలిపెట్టినట్లు నొప్పి ఉండవచ్చు. ఇది కొన్ని నిమిషాలు పాటు ఉంటుంది. వీపునొప్పి, కడుపుపై బాగంలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు వస్తాయన్నారు. తలలో చెమటలు పట్టడం వంటి లక్షణాలు గుండె పోటుకు దారితీస్తాయి. ఈ లక్షణాలున్న వారు వెంటనే దగ్గరలోని కార్డియాక్ హాస్పిటల్‌లో చూపించు కోవలన్నారు. రక్తంలో కొలస్ట్రాల్ శాతాన్ని తగ్గించుకోవడం, ఉదయం, సాయంత్రం నడక చేయాలన్నారు.

ప్రైమరీ యాంజియోప్లాస్టీ ప్రోసీజర్ ద్వారా..

గుండె సంబంధిత వైద్యం అందించడంలో గత 25 సంవత్సరాలు అనుభవం కలిన ఇంటర్నేషనల్ కార్డియాలజీస్టు డాక్టరు వెంకటరమణ వేలాది మందికి యాంజియోగ్రామ్, యాంజియో ప్లాస్‌టైస్, వాల్వ్యూలో ప్లాస్‌టైస్ వంటి వైద్య పద్దతుల ద్వారా చాలా మంది రోగుల ప్రాణాలను కాపాడారు. ప్రైమరీ యాంజియో ప్లాసీ అనేది గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రాణాలు పోకుండా అనుసరించే నూతన విదానం. ఇది వెంటకరమణ హార్ట్ అండ్ మెటర్నిటీ హాస్పిటల్‌లో ఉంది. 6 గంటలోపు గుండెపోటుకు గురైన వ్యక్తికి 100 శాతం గుండెలో బ్లాక్‌లను తీసేయవచ్చున్నారు. గుండె వైద్యంలో ప్రైమరీ యాంజియోప్లాస్టీ అనేది ప్రత్యామ్నా యంగా చెప్పవచ్చు. తమ ఆసుపత్రిలో ప్రైమరీ ఆయంజియోప్లాస్టీ 98 శాతం విజయవంతంగా చేశావమన్నారు. వెంకటరమణ హార్ట్ ఆసుపత్రిలో ఉన్న నిస్టాత అనుభవం కల్గిన వైద్య బృందంతో రోగుల ప్రాణాలను కాపాడుటలో విజయం సాధిస్తున్నామన్నారు.



డాక్టర్ సి.వెంకటరమణ

డాక్టర్ నిరుపమ

వైద్య శిబిరాలు..

తిరుపతి నగర పరిధితో పాటు పరిసరాల ప్రాంతాల్లో వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మారుతున్న కాలం ప్రకారం రోగాలకు ఆధునూతన వైద్యం అందుబాటులోకి వచ్చిందని, ఈ నూతనంగా వచ్చిన వైద్య సదుపాయాలను ప్రజలకు ఎప్పటికప్పుడు ఈ వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు ద్వారా వివరిస్తున్నామన్నారు. తమ ఆసుపత్రిలో గుండెపోటు వచ్చిన వారికి 24 గంటలలోపు ఉచితంగా స్టెంట్ అమర్చే సదుపాయం ఉందన్నారు. బైపాస్ సర్జరీ, గుండె ఆపరేషన్లు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. గుండె జబ్బులతో పాటు స్త్రీలకు సంబంధించిన గర్భశయ వ్యాధులు, ఇతరాత్ర వాటికి ప్రముఖ గైనకాలజీస్టు డాక్టరు ఆర్.నిరుపమ ఆధ్వర్యంలో అత్యాధునిక వైద్యాన్ని, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్నామన్నారు. ఇది గవర్నమెంట్ అప్రూవుడ్ ఫ్యామిటీ ప్లానింగ్ సెంటర్. ఇక్కడ ఎస్‌పిడిసిఎల్, గరవ్నమెంట్ ఉద్యోగులకు రీయంబర్స్‌మెంట్ సౌకర్యం కలదని తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9490109100, 9492458183 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు..

- కార్డియాలజి, కార్డియోథొరాసిక్ సర్జరీ.
- గైనికాలజీ అండ్ ఓబిసిటీస్.
- జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్.
- 24 గంటలు ఎమర్జనీ వైద్యం.

తిరుపతిని తాకిన లిక్కర్ వివాదం

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఒకప్పుడు డిల్లీలోని క్రేజీవాల్ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేసి, ముఖ్యమంత్రిని సైతం జైలు పాలు చేసిన లిక్కర్‌స్కాం, ఇప్పడు ఆంధ్రప్రదేశ్‌లో హాల్‌చల్ చేస్తుంది. ఏకంగా తిరుపతి జిల్లానుతాకి ప్రకంపనలు సృష్టిస్తోంది. వైసిపి కీలక నేతలను లిక్కర్‌స్కామ్‌లు జైలు పాలు చేస్తోంది. అందులో బాగంగానే నాలుగు రోజుల క్రితం జిల్లాకు చెందిన వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి అరెస్టు అయ్యారు. ఆయన అరెస్టుతో నియోజకవర్గంలో నిరసన హోరు సాగుతోంది. చట్టం తనపని చేసుకుపోతుందనేలా కూటమి నాయకులు వ్యవహరిస్తుండడం గమనార్హం.

ఏపి లిక్కర్ స్కామ్... ఢిల్లీలో ప్రభుత్వాన్ని అతలాకుతలం చేసిన ఈ స్కామ్ నేడు ఏపిలోని ప్రతిపక్షాన్ని ఇబ్బందులకు గురి చేసేందుకు కూటమికి ఎంతో ఉపయోగకరంగా మారింది. వాస్తవానికి లిక్కర్‌స్కామ్ జరిగిందని నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు పార్లమెంట్‌లో ఆరోపించడం, ఆఘమేఘాల మీద కేంద్ర హోంమంత్రి తన బేటీలో స్కామ్ వివరాలు ఇవ్వమని అడగడం చకచకా జరిగిపోయింది. ఏపి లిక్కర్‌స్కామ్ ఢిల్లీ కంటే ఎన్నో రెట్లు పెద్దదని, ఏపితో పోల్చితే ఢిల్లీ స్కామ్ నీటిబొట్టంతేనని, ఏపిలోని గత ప్రభుత్వం మద్యం దుకాణాలను స్వయంగా నిర్వహించేదని, 90 వేల కోట్ల మద్యం వ్యాపారంలో 18వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని, 2 వేల కోట్లు బినామీ పేర్లతో దుబాయ్, ఆఫ్రికాలకు తరలించారన్న ఆరోపణలు చేశారు. హైదరబాబుదకు చెందిన ఎన్.సునీల్‌రెడ్డి 2వేల కోట్ల రూపాయలు దుబాయ్‌కు తరలించిన పత్రాలను ఎంపి కేంద్ర హోంమంత్రికి అందజేశారు. ఏపి మద్యం కుంభకోణం పర్యవసనాల వల్లే ఎంపి విజయసాయిరెడ్డి రాజనీమా చేసి, రాజకీయాలకు దూరంగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో 22 డిస్టిలరీలను చేజిక్కించుకుని విచిత్రమైన బ్రాండ్ల పేర్లతో 26 కొత్త కంపెనీలను ప్రారంభించారని, అంతర్జాతీయ బ్రాండ్లు అన్నిటిని వెళ్లగొట్టారని, ప్రభుత్వ దుకాణాల్లో 99 కోట్లు అమ్మకాలు జరిగితే 690 కోట్లు మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరిగాయని, మిగతా సొమ్ములో అత్యధిక బాగం జగన్, ఆయన అనుయాయులు కబళించారని తీవ్రంగా విమర్శించారు. దీనిపై సిట్ విచారణ చేపట్టింది. సుమారు 50 మందికి పైగా నిందితులను గుర్తించింది. తిరుపతికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన సైఫ్ అహ్మద్ కుంభకోణంలో, డబ్బు తరలింపులో కీలకంగా వ్యవహరించారని నిర్ధారణకు వచ్చింది. ఇందులో వైసిపి సీనియర్ నాయకుల పాత్రపై విచారణ ముమ్మరం చేసింది. చంద్రగిరి మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి ద్వారా స్కామ్ డబ్బులు విదేశాలకు వెళ్లాయని భావించి అందుకు తగ్గ ఆధారాల సేకరణకు విచారణ మరింత వేగవంతం చేశారు. చెవిరెడ్డి గన్‌మెన్లుగా గతంలో పని చేసిన గిరి, మదన్‌రెడ్డిలను సిట్ విచారించింది. అందులో గిరి అనే కానిస్టేబుల్ చెవిరెడ్డి అక్రమ డబ్బులను తరలించారని, ఎన్నికలకు సైతం వినియోగించారని అంగీకరిస్తూ, సిట్ అధికారులకు సంబంధిత అధారాలు అందజేయడంతో అయన్ని వేరే విబాగానికి బదిలీ చేసింది. మరో గన్‌మెన్ (హెడ్‌కానిస్టేబుల్) అదంతా అబద్దమని చెప్పారు. పైగా సిట్ అధికారులు ముందే సిద్దం చేసిన స్క్రిప్ట్‌ను అంగీకరించాలని, సంతకాలు చేయాలని తనను శారీరకంగా, మానసికంగా హింసించారని, సిట్ అధికారుల నుంచి తనను కాపాడాలని, లేకుంటే ఆత్మహత్యే శరణ్యమని డిజిపికి లేఖ రాశారు. ఆయన ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18వ తేది తిరుపతి జిల్లా చంద్రగిరి మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డిని లిక్కర్‌స్కామ్ కేసులో 38వ నిందితుడిగా చేర్చి, బెంగుళూరు విమానశ్రయంలో సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈయనకు కోర్టు 14 రోజులు రిమాండు విధించింది. చెవిరెడ్డి అరెస్టుతో జిల్లాలో సుమారు 5 మందిని సిట్ అరెస్టు చేసి, విచారణ చేసింది. చెవిరెడ్డి అరెస్టుతో ఆ పార్టీ శ్రేణులు రోడ్డెక్కాయి. నియోజకవర్గం కేంద్రంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నిరసన ర్యాలీలు చేపడుతున్నాయి. అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసిన చెవిరెడ్డిని విడుదల చేయాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లిక్కర్ స్కామ్ పేరుతో ప్రతిపక్షాన్ని ఇబ్బందులు పెడుతున్న కూటమీ ప్రభుత్వం, ఆ కేసుపై చూపించిన శ్రద్దలో పావు వంతు ప్రజా సంక్షేమంపై చూపితే బాగుండేదని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. అర్ధరాత్రి పదుల సంఖ్యల్లో జేసిబిలతో కాలనీ కాలనీనే కూల్చేసిన వారిని 26 రోజుల అవుతున్న ఇప్పటి వరకు కనీసం గుర్తించ లేదన్నారు. బాధితులకు అండగా ఉంటామని ప్రభుత్వం నుంచి హామీ కూడా లేదని ఆరోపించారు. జిల్లాలో ప్రసిద్దిగాంచిన మామిడి మార్కెట్ దామల్‌చెరువులో ఉంది. మామిడి రైతులు ధరలు లేక పంటలను రోడ్ల పాలు చేస్తుంటే కలెక్టర్ చొరవతో అధికారులు తూతూమంత్రంగా చర్యలు ప్రారంభించి, కిలోకు కేవలం రూ.4 అన్నా ఇవ్వండని కంటి తుడుపు ప్రకటనలకే పరిమితమయ్యారని విమర్శించారు. తప్పు చేసిన వారిని శిక్షించాల్సిందే.. కానీ ఏ తప్పు చేయని, తమకు ఏదో చేస్తుందని అశతో కూటమీ ప్రభుత్వానికి అండగా నిలబడి, అధికారాన్ని అప్పగించిన ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కూడా శ్రద్ద పెట్టాలి. ఇప్పటికైన కూటమీ ప్రభుత్వం అధికార, ప్రతిపక్షాల మద్య కక్షసాధింపులను పక్కన పెట్టి, తమను ఎన్నుకున్న ప్రజానీకం సమస్యలపై దృష్టి పెట్టి, వాటిని పరిష్కరించాలని పలువురు ప్రజాసామ్యవాదులు, ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆశిద్దాం...!

బస్సుల్లో నిద్ర, ఆకలితో కేకలు..

ఇదేనా యోగాంధ్రా?

ప్రజాశక్తి - క్యాంపస్ : విశాఖపట్నంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, లంబసింగి వంటి గిరిజన ప్రాంతాల నుంచి 25 వేల మంది విద్యార్థులను కనీస సౌకర్యాలు లేకుండా తరలించిన ప్రభుత్వం యొక్క దారుణ నిర్లక్ష్యాన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ నాయకులు తీవ్రంగా ఖండించారు. గిన్నిస్ రికార్డు కోసం విద్యార్థులను ఇబ్బందుల పాలు చేశారని ఆరోపించారు. ఆహారం, వసతి లేక విద్యార్థులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రచార ఉత్సవంగా మార్చి, విద్యార్థులను కేవలం సంఖ్యలుగా భావించిన ప్రభుత్వం, గిరిజన చిన్నారుల ఆరోగ్యం, భద్రతను పూర్తిగా విస్మరించిందన్నారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గిన్నిస్‌కోసం గిరిజన బిడ్డలకు తిప్పలు : బండి చలపతి

రాష్ట్ర ప్రభుత్వం తన గొప్పల కోసం, మోదీ మెప్పు కోసం, మరీ ముఖ్యంగా గిన్నిస్ రికార్డు కోసం వేల మంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారని బండి చలపతి మండిపడ్డారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతమైతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

బీసీ ఆత్మగౌరవ సభ 6కు వాయిదా

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): బీసీలకు రాజకీయంగానే కాకుండా అన్నింట తమ ప్రాధాన్యత కల్పించాలని ఉద్దేశంతో నిర్వహించ తలపెట్టిన బీసీ ఆత్మగౌరవ భరోసా సభ వాయిదా పడిందని, తిరిగి 6వ తేదీన ఇందిరా మైదానంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం అంబేద్కర్ పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీసీ ఆత్మగౌరవ భరోసా నిర్వహిస్తున్నామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్ తెలిపారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని ఓ ప్రైవేట్ హోటల్లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25న తిరుపతిలో పూలే విగ్రహం నుండి ప్రచార రథాలు రాష్ట్ర నలుమూలల పయనమవుతాయన్నారు. ఈ ఆత్మగౌరవ భరోసా సభకు దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ బీసీ నాయకులు, బీసీమంత్రులు, మేధావులు హాజరై బీసీల ప్రాధాన్యతను వివరిస్తారన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాలలో ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, సంఘాల కార్యవర్గ సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధికార ప్రతినిధి ఆవులపాటి బుజ్జి బాబు మాట్లాడుతూ 50వేల మంది ఆత్మగౌరవ భరోసా సభకు హాజరవుతారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి నగర అధ్యక్షులు జగదీష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం



కార్యదర్శి మనోజ్ కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని మంగళం-2కి పంచాయతీ కార్యదర్శిగా నియమితులైన మనోజ్ కుమార్‌ను ఉప సర్పంచ్ బైరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా వారు కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బత్తల గోపి, దావల దయాకర్, కన్నయ్య, వార్డు సభ్యుడు దినేష్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దారుగా జీవన్



ప్రజాశక్తి - తొట్టంబేడు : మండల డిప్యూటీ తాసిల్దారుగా జీవన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి రావడం జరిగింది. గతంలో ఇక్కడ డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేసిన జగన్ శ్రీకాళహస్తి మండలం తాసిల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

శ్రీకాళహస్తి తహశీల్దారుగా జనార్ధన్ రాజు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి తహశీల్దారుగా జనార్ధన్ రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహశీల్దారుగా పనిచేసిన లక్ష్మీనారాయణ సాధారణ బదిలీలో భాగంగా తిరుపతి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో చిన్నగొట్టిగల్లు తహశీల్దారుగా పనిచేస్తున్న జనార్ధన్ రాజు శ్రీకాళహస్తి తహశీల్దారుగా బాధ్యతలు తీసుకున్నారు.

రామారావుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వెంకటగిరి: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలని కోరుతూ చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 3వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి వెంగయ్య మాట్లాడుతూ శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని బదిలీ చేయాలని, పారిశుధ్య విభాగం నుండి పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ఇంజనీరింగ్ కార్మికులు, సిఐటియు వెంకటగిరి మండల అధ్యక్షులు ఏ మంజుల, యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, సుబ్బయ్య, ఎస్ ప్రసాద్, పి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ గురుమూర్తి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఎంపీ మద్దెల గురుమూర్తి జన్మదిన వేడుకలు ఆదివారం వైసీపీ మండల అధ్యక్షుడు మణి నాయుడు, సీనియర్ వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కావున వైసీపీ నాయకులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

పల్లె పల్లెకూ ఆర్ఓ ప్లాంట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గ్రామీణ ప్రజలకు సురక్షితమైన మంచి నీటిని అందించడమే లక్ష్యంగా పల్లె పల్లెకూ ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా శ్రీకాళహస్తి మండలంలోని ఓబులాయపల్లె గిరిజన కాలనీ, ఎర్రమరెడ్డి పాలెంలో ఆర్ఓ ప్లాంట్లను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ ఏర్పాటు

ప్రజాశక్తి -కోట : కోట మండలం, స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కటారి జయ జయరావు ఆధ్వర్యంలో కార్యాలయంలో శనివారం వాటర్ కూలర్ ఏర్పాటు చేశారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, గాంధీనగర్‌కు చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు హరిబాబుకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు వైద్యం కోసం అనేకసార్లు సాయం అందించారు. ఇటీవల హరిబాబు మరణించడంతో అతని కుమార్తె శోభితకు చదివించే బాధ్యత ట్రస్ట్ తీసుకుంది. అందులో భాగంగా శనివారం ట్రస్ట్ సభ్యులు ప్రవీణ్‌రెడ్డి ద్వారా పది వేల రూపాయల నగదును పాప చదువు కోసం తల్లి మనీషాకు అందజేయడం జరిగింది.

మా ఊరు బడి మాకే కావాలి.. సిపిఎం ధర్నా



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలం, ఎగువ గూళూరు దళితవాడలో ఐదో తరగతి వరకు బోధన కలిగిన పాఠశాల గత 50 సంవత్సరాలుగా ఉంది. ఈ పాఠశాలను ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలలో విలీనం చేయవద్దని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విలీనాన్ని వ్యతిరేకిస్తూ శనివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పుత్తూరు కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విలీనం పేరుతో ఇన్నేళ్లుగా ఎంతో చిన్నారులకు ఎంతో సౌకర్యంగా ఉన్న ఈ పాఠశాలను మూసేయడం దారుణమన్నారు. చిన్న పిల్లలు ఒకటిన్నర కిలో మీటరు దూరం వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎగువగులూరు దళితవాడ పాఠశాలలో 19 మంది విద్యార్థులు ఉండగా, నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్న దిగువ గూళూరు పాఠశాలలో విలియం సరికాదన్నారు. అంత దూరంలో ఉన్న పాఠశాలకు మామిడి తోటల్లోంచి వెళ్లేందుకు చిన్నారులు భయపడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై మండలంలో విలీనం అవుతున్న అన్ని పాఠశాలల తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నామని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల విలీనం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేయర్ రమేష్ బాబుకు సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం: రామచంద్రపురం మండల సర్వేయర్‌గా పనిచేసి బదిలీ అయిన రమేష్ బాబును గ్రామ సచివాలయ సర్వేయర్లు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే ఉప తహశీల్దార్ అమృత, మంజుల, మధుబాబు,, షణ్ముఖ రెడ్డి, భాష, పురుషోత్తం, గుణశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ మేరకు బదిలీలు చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం: గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న గ్రామ సర్వే ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి, రేష్నె రైజేషన్, సీనియార్టీ మేరకు బదిలీలు చేయాలని మండల గ్రామ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మధు బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌సి పురం తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నుండి చేపట్టనున్న పెన్‌డౌన్ నోటీసును రీ సర్వే ఉప తహసిల్దార్ అమృతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంజుల, గుణశేఖర్, పురుషోత్తం, షణ్ముగ రెడ్డి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆధునిక సోలార్ ఉత్పత్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సోలార్ ఎనర్జీ ఉత్పత్తుల తయారీ సంస్థ ఈస్ట్ మ్యాన్ ఆటో పవర్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపితమై, శక్తివంతమైన లైన్ అప్ అత్యాధునిక సోలార్ ఉత్పత్తులను అందిస్తోందని ఆ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. మన్నికైన, నిలకడైన శక్తి కోసం పెరుగుతున్న డిమాండ్‌కి తగ్గట్టుగా ఈస్ట్ మ్యాన్ ఇప్పుడు గ్రిడ్ టై ఇన్వెర్టర్స్, హైబ్రిడ్ ఇన్వెర్టర్‌లు, ఆఫ్ గ్రిడ్ ఇన్వెర్టర్‌లు, లీడ్ యాసిడ్, లిథియం బ్యాటరీలు, సోలార్ ప్యానల్స్‌ని అందుబాటులోకి తెచ్చామని ఆయన తెలిపారు. ఈ ఉత్పత్తులను గృహ అవసరాలకు, కమర్షియల్, పరిశ్రమల వాడుక కోసం తయారు చేశారన్నారు. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, కర్నూల్, గుంటూరు మార్కెట్‌లలో ఈఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు.

స్టార్టప్‌ల వృద్ధికి కృషి చేద్దాం

ప్రజాశక్తి - క్యాంపస్ : స్టార్టప్‌ల వృద్ధికి చట్టపరమైన, ఆర్థిక నిర్మాణం అత్యావశ్యకం అని సింగపూర్ గోవిన్ హోల్డింగ్స్ వ్యవస్థాపకుడు, సిఇఓ డాక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిధి ప్రయాస్ పథకం కింద, ఎస్ఎస్ఐఐఇ - టిబిఐలో, నిధి ప్రయాస్ శాలను ప్రారంభించి, సావేరి సెమినార్ హాల్‌లో "స్టార్టప్‌ల వృద్ధికి చట్టపరమైన, ఆర్థిక నిర్మాణం" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా నిధి ప్రయాస్ కార్యక్రమం కింద గైడెడ్ సపోర్ట్, మౌలిక సదుపాయాలు, నిధుల యాక్సెస్ ద్వారా సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు సాధికారత కల్పించడంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. సెమినార్‌లో డాక్టర్ ఆనంద్ గోవిందలూరి "శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణల కోసం వెంచర్ క్యాపిటల్ నిధులను ఆకర్షించడం" అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విసి ఆచార్య వి. ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని, ఎస్ఎస్ఐఐఇ - టిబిఐ సిఇఓ సూర్యకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనం ఆపాలి : ఎస్ఎఫ్ఐ



ప్రజాశక్తి - క్యాంపస్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 18వ అఖిల భారత మహాసభలు కేరళ, ఖోజికోడ్ జిల్లాలో 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ యస్వీయులోని ప్రకాశం భవన్ ఎదురుగా ఎస్ఎఫ్ఐ నాయకులు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో-కన్వీనర్ అశోక్ కుమార్, యూనివర్సిటీ అధ్యక్షులు నరసన్న, కార్యదర్శి వినోద్‌లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల పాఠశాలలను విలీనం పేరుతో మూసివేయాలని ప్రయత్నిస్తున్నదని తెలిపారు. దీంతో రాష్ట్రంలో నిరక్షరాస్యత పెరిగే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల విలీనం ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు తిరుమలేష్, భాను, శ్రీకాంత్, ఆకాష్, భాస్కర్, మాతేశ్వరి తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - రామచంద్రాపురం: రాష్ట్రంలోని మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చి తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని డిఆర్డిఏ పథక సంచాలకులు శోభన్ బాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లతో రుణాల మంజూరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు విరివిరిగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు మేనేజర్లను కోరారు. మహిళా వ్యాపారవేత్తలకు మండలానికి నిర్దేశించిన టార్గెట్ 230 మందికి గుర్తించిన ఔత్సాహిక వ్యాపారవేత్తలను తయారు చేసే దిశలో బ్యాంకర్స్ ప్రముఖ పాత్ర వహించాలన్నారు . ఈ కార్యక్రమంలో ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ రాధాకృష్ణ, రాము, ఏపిఎం గురుమూర్తి, సీసీ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలం, తిన్నెలపూడి యూనిట్ కోటలో ఐసీఆర్పీ భాగ్యలక్ష్మి ఫీల్డ్‌లో ఎటిఎం(ఎనీ టైమ్ మోడల్)12 రకాలు విత్తనాలతో వేయడం జరిగింది. దీనిలో ప్రధానంగా 5 రకాలు పంటలు చిక్కుడు, బెండ, ముల్లంగి, బీట్రూట్, క్యారట్ విత్తనాలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, పద్మ, శివకుమారి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అతిసార వ్యాధి నుండి రక్షణ పొందండి అనే కార్యక్రమం వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ ఆదేశాల మేరకు ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు నేర్పాకోట యానాది కాలనీలో నిర్వహించారు. చిన్న బిడ్డల తల్లులకు అవగాహన కల్పించారు. అతిసార వ్యాధి సోకకుండా జాగ్రత్తలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు గౌరి, ఎంఎల్ హెచ్పిలు, ఆశలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి కర్తవ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పరిసరాలను శుభ్రం చేయడం, మొక్కలను నాటడం, ప్లాస్టిక్ నిషేధించటం విద్యార్థుల ముఖ్య కర్తవ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ బాబురావు, డాక్టర్ కందేరి శ్రీదేవి, డాక్టర్ సుజల స్వప్న, డాక్టర్ సురేష్, డాక్టర్ నర్సింహారెడ్డి, డాక్టర్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : తహశీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ కార్యాలయాలలో పాఠశాలల్లో స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ చంద్రబాబు నాయుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లయ్య, కిరణ్ కుమార్, గురునాథం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి అన్న ప్రసాదానికి విరాళాలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి నిత్యాన్నదాన పథకానికి శనివారం పలువురు దాతలు ఆర్థిక విరాళాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన బాలసుబ్రమణ్యం దంపతులు రూ. లక్ష, సికింద్రా బాద్‌కు చెందిన రంభ, రాజేష్ దంపతులు రూ. 50 వేలు చెక్కు రూపంలో ఆలయాధికారులకు అందజేశారు.

ప్రారంభం కాకముందే వాలిపోతున్నాయి

- తిరుపతి-కరకంబాడి మార్గంలో పొంచి ఉన్న ముప్పు
- నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏడాది క్రితం మంగళం వెంకటేశ్వర కాలనీ నుండి కరకంబాడి వరకు 6.5 కిలోమీటర్ల మేర టిటిడి ఏర్పాటు చేసిన రహదారి విద్యుత్ లైట్లు ప్రారంభం కాక ముందే వాలిపోతున్నాయి. బలమైన విద్యుత్ స్తంభాలు ఇటుగా ప్రయాణించే వాహనాలపై పడితే ప్రాణ నష్టంతో పాటు వాహనాలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ రహదారి విద్యుత్తు దీపాలు ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాకు నోచుకోలేదని, ఇంతలో ఏడాదికాకముందే ఈ విద్యుత్ స్తంభాలు ఒరిగి పోతుండడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. దీన్నిబట్టి చూస్తే ఈ విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు గుత్తేదారు ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటించారో ఇట్టే అర్థమవుతోందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎస్పీడీసీఎల్ వారు టీటీడీకి డిమాండ్ నోటీసు ఇచ్చి చాలా కాలం అయినా కూడా టీటీడీ నుండి నిధులు విడుదల కాకపోవడంతో టీటీడీ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలుగులు పంచడం లేదు. ఇప్పటికైనా టిటిడి అధికారులు మొద్దు నిద్ర వీడి పొంచి ఉన్న ప్రమాదం నుండి ప్రయాణికులను రక్షిస్తూ, రహదారి విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజల కోరుతున్నారు. రోజుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో టీటీడీ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు వాహనాలపై పడకముందే సత్వర చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఉద్యోగుల బదిలీలు పారదర్శకం


ప్రజాశక్తి - తిరుపతి టౌన్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లోని నిబంధనలకు లోబడి పారదర్శకంగా చేపట్టడం జరుగుతోందని అనంతపురం రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీల్లో సచివాలయ కార్యదర్శుల అర్హతలను ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. ఈ బదిలీలపై వదంతులు నమ్మవద్దని తెలిపారు.

'యువత పోరు' విజయవంతం చేయండి: పాలేటి నాగార్జున



ప్రజాశక్తి - నాయుడుపేట: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైయస్సార్సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25న సోమవారం ఉదయం కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూళ్లూరుపేట నియోజకవర్గం వైసిపి యువజన అధ్యక్షుడు పాలేటి నాగార్జున యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గురించి ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, జాబ్ క్యాలెండర్, యువతకు సంబంధించిన అన్ని హామీలు వెంటనే అమలు చేయాలని "యువత పోరు" అనే నిరసన కార్యక్రమం ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. యువత భారీగా తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీకాళహస్తి అభివృద్ధికి సహకరించండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కేంద్ర మంత్రులను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. యోగా డే సందర్భంగా శనివారం విశాఖకు వెళ్లిన బొజ్జల పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. మౌలిక సదుపాయాల వృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, శ్రీకాళహస్తి దేవస్థానాన్ని ప్రోత్సహించే పర్యాటక అభివృద్ధికి కేంద్ర సహకారం కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రులు ప్రతాప్‌రావు జాధవ్, రామ్మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రావులు తప్పకుండా తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా యోగా దినోత్సవం

మానసిక, శారీరక నియంత్రణ యోగాతోనే సాధ్యం

: టిటిడి అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి

ప్రజాశక్తి తిరుపతి సిటీ: టిటిడి అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో టిటిడి పరిపాలనా భవనం వెనుక ఉన్న పరేడ్ మైదానంలో శనివారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జి. భాను ప్రకాష్ రెడ్డి, జేఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్వో మురళీ కృష్ణ, పలువురు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ దంపతులు

గూడూరు, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో పురపాలక సంఘ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆయన సతీమణి సంధ్యారాణి హాజరయ్యారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం: శనివారం మండల కేంద్రంలోని బిసి గురుకుల పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో తెదేపా దొరవారిసత్రం మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసునాయుడు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగలో.. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో యోగా దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో వెంకటరత్నమ్మ, మండల విద్యాశాఖ అధికారులు యోగా కార్యక్రమం నిర్వహించారు.

పుత్తూరులో.. స్థానిక మున్సిపల్ పార్కులో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ ఆధ్వర్యంలో శనివారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్లు శివయ్య, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో.. సెవెన్త్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వెంకట నాగ పవన్ ఆధ్వర్యంలో శనివారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితోపాటు విద్యార్థిని విద్యార్థులు యోగా చేశారు. చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో.. తిరుపతి, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఇందిరాగాంధీ రాష్ట్రీయ కళా కేంద్రం, ప్రాంతీయ కేంద్రం తిరుపతి, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం యోగ దినోత్సవాన్ని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో నిర్వహించారు.

మహిళా వర్సిటీలో.. శనివారం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యాచురోపతి, పూనా, ఆయుష్ మంత్రిత్వ శాఖల తరుపున శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విసి ఉమ, రిజిస్ట్రార్ రజిని, ఈజీఎస్ గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

తొట్టంబేడులో.. తొట్టంబేడు పంచాయతీ ఉన్నత పాఠశాలలో శనివారం యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి సర్కిల్ సిసిఎఫ్ సెల్వం ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. తిరుపతి కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయచంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. మంగళం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్థానిక టిడిపి నాయకులు, పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేసి యోగా విశిష్టతను వివరించారు. తిరుమల నగర్ పంచాయతీలో యోగా దినోత్సవం సందర్భంగా టిడిపి నాయకులు, ప్రజలు యోగాసనాలు వేసి తద్వారా కలిగే మేలును వివరించారు.

శ్రీసిటీలో.. శనివారం యోగా దినోత్సవాన్ని శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం విజిటర్స్ సెంటర్ ఆవరణలో ప్రత్యేక ఆయుర్వేద శిబిరం నిర్వహించారు.

యర్రావారిపాలెంలో.. మండలంలో తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో, గ్రామ సచివాలయాల్లో, శ్రీజ పాల కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో ఉదయమాణిక్యం పంచాయతీ రైతులుచే యోగ చేయించారు.

పుత్తూరు కోర్టు ఆవరణలో.. పుత్తూరు, కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో జడ్జీలు, న్యాయవాదులు శనివారం యోగ కార్యక్రమం నిర్వహించారు.

తిరుపతి, తనపల్లి శశి విద్యాసంస్థల్లో.. తిరుపతి రూరల్ మండలం స్థానిక తనపల్లిలోని శశి విద్యాసంస్థలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు.

ఏర్పేడు ఐఐటిలో.. యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పేడు ఐఐటిలో విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు యోగ కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ సత్యనారాయణ యోగాతో ప్రయోజనాలను వివరించారు.

కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో.. శిల్పారామం వాకర్స్ అసోసియేషన్, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.

తిరుపతి కొర్లగుంట మున్సిపల్ స్కూల్లో.. తిరుపతి, కొర్లగుంటలోని నగరపాలక సంస్థ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరాగి పట్టడం మున్సిపల్ స్కూల్లో.. స్థానిక బైరాగి పట్టెడల, మహాత్మా గాంధీ మునిసిపల్ హైస్కూల్లో ఈరోజు ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగినది.

ప్రజాశక్తి -కోట : శనివారం కోట మండలంలో యోగా దినోత్సవం కార్యక్రమంలో మండల పరిధిలోని సచివాలయ సిబ్బందిచే, అన్ని పాఠశాలల్లో యోగా కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ హైస్కూల్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ కే.జె జె రావు, ఎంపీడీవో దిలీప్ కుమార్, హౌసింగ్ ఏఈ భాస్కర్ పాల్గొన్నారు.

తపస్య పాఠశాలలో.. ప్రజాశక్తి - రేణిగుంట: శనివారం రేణిగుంట తపస్య పాఠశాల యాజమాన్యం 500 మందికి పైగా విద్యార్థులు, 60 మందికి పైగా ఉపాధ్యాయులతో యోగా కార్యక్రమం నిర్వహించారు.

తిరుపతి సిటీ : సుదహ్ లిటిల్ ఏంజిల్స్ స్కూల్‌లో శనివారం యోగా సాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో.. ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో నూతనంగా ప్రారంభించిన విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం పాఠశాల చైర్మన్ విద్యా ప్రకాష రెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం వేడుకలు జరిగాయి.

ప్రజాశక్తి - నాయుడుపేట: మనిషికి ఇప్పుడున్న ఒత్తిడిలో ప్రతిఒక్కరు యోగ చేయటం తప్పనిసరని జడ్జి పి. మీనాక్షి సుందరి పేర్కొన్నారు. ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయుడుపేట సివిల్ కోర్టులో న్యాయమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆశ చెంచు కృష్ణయ్య, యోగా ట్రైనర్ వై.పోతన, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం : శనివారం యోగా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయ్యాల్లు, పాఠశాలల్లో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో ఇందిరమ్మ, ఎంఈఓ మార్కండేయ నాయుడు, ఏఎస్ఐ ఈశ్వరయ్య, డిటిఎం అన్వర్ భాష, అమృత, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పది రూపాయల కోసం కొట్టుకున్నారు



గాయపడ్డ కోటి, దాడి చేసిన వీరయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఇద్దరు తాగుబోతులు పది రూపాయల కోసం కొట్టుకోగా ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం సాయంత్రం పట్టణంలోని బీపీ అగ్రహారం సర్కిల్ వద్ద చోటు చేసుకుంది. పట్టణంలోని ఓ హోటల్లో సర్వర్‌గా పని చేస్తున్న కోటి, రేణిగుంట చెందిన వీరయ్యలు బీపీ అగ్రహారం సర్కిల్ వద్ద ఉన్న ఓ మద్యం దుకాణంలో పూటుగా మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరికీ పది రూపాయల విషయంలో పేచీ ఏర్పడింది. దీంతో ఇద్దరూ గొడవపడ్డారు. కోటీని వీరయ్య కింద తోసేయడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆపై బీరు బాటిల్‌తో దాడి చేయడంతో కోటీ(38)కి తీవ్ర రక్త స్రావమైంది. సమాచారం అందుకున్న వన్ టౌన్ కానిస్టేబుల్ కన్నయ్య హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వీరయ్యను అదుపులోకి తీసుకున్నారు. గాయపడ్డ కోటీని చికిత్స నిమిత్తం 108లో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఊరు తీసుకెళ్లలేదని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : భర్త సొంతూరు తీసుకెళ్లలేదని భార్య మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని మంచినీళ్ల గుంట ప్రాంతంలో శనివారం వెలుగు చూసింది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నీరజ్, కౌసల్య దంపతులు 15 ఏళ్ల కిందట పానీ పూరీ వ్యాపారం నిమిత్తం మంచినీళ్ల గుంట ప్రాంతంలో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో పది రోజుల కిందట నీరజ్ స్వస్థలానికి వెళ్ళాడు. అయితే భర్త తనను కూడా సొంతూరికి తీసుకెళ్లలేదన్న బాధలో ఈ నెల 19వ తేదీన కౌసల్య(28) ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. శనివారం నీరజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కౌసల్య మృదేహానికి పోస్టుమార్టం నిర్వహించి భర్తకు అప్పగించారు.

పిఏఏపి డివిజన్ అధ్యక్షుడుగా ఏవీ కుమార్



ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణ, మౌలిక వసతులపై నిరంతరం పోరాటం చేస్తున్న పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రాప్రదేశ్ కమిటీ. నాయుడుపేట డివిజన్ అధ్యక్షుడుగా ఏవీ కుమార్‌ను నియామకం చేసినట్టు ఒక ప్రకటన విడుదల చేశారు. నాయుడుపేట డివిజన్ అధ్యక్షుడుగా ఎన్నికైన ఏవీ కుమార్ మాట్లాడుతూ ప్రవేటు పాఠశాల యాజమాన్యం ఫీజులు, పుస్తకాలు, యూనిఫారమ్, ఐడి కార్డులు పేరుతో దోచుకుంటోదని ఆరోపించారు. ఈ అసోషియేషన్ పోరాట ఫలితంగా గత వారం క్రితం నెల్లూరు జిల్లా కలెక్టర్ స్పందించి ప్రైవేటు పాఠశాలలపై విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రవేటు పాఠశాలల్లో ఎక్కడైనా విద్యార్థులకు సమస్యలు పరిష్కారం కోసం కమిటీకి సమాచారం అందించాలని కోరారు.

బాలికల హాస్టల్ పరిశీలన

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల కేంద్రంలోని ఏకొల్లు ఎస్సీ బాలికల హాస్టల్‌ను శనివారం స్థానిక తహశీల్దార్ శైలకుమారి పరిశీలించారు. విద్యార్థినిలకు మౌలిక వసతులు ఏర్పాటులో లోపం లేకుండా చూడాలని హాస్టల్ నిర్వహకులకు సూచించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - రామచంద్రపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను తిరుపతి డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ తనిఖీ చేశారు. శనివారం మండలంలోని నెత్త కుప్పం, కుప్పం బాదురు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనం రూ.300కు తక్కువ లేకుండా క్షేత్ర సహాయకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) TIRUPATI

I.P.No. 25 of 2024

D.Vittal Babu ...Petitioner

V/s

T.Lakshmi Rajyam and another ...Respondents

IP notice Respondents No.1

R1) Thokata Lakshmi Rajyam W/o S.Ramakrishna, R/o Door No.11-86/1, Telephone Colony, Oteru Road, Srinivasapuram, Tirupati Rural Mandal

Please take notice in the above insolvency petition filed by the petitioner against you are posted to 11-08-2025 for your appearance before the above court. If you got any objections, attend the above court on the above date at 10-30a.m. and file the same. Failing which the matter will be decided exparte.

Hearing Date: 11.08.2025

D.JAYACHANDRA

Advocate, Tirupati

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

S.O.P. No.195/2024

1. Yarramaka Venkata Rathnamma
2. Yarramaka Theja
3. Yarramaka Bhaskar Reddy
4. Yarramaka Leela Mohan ...Petitioners

Vs.

Nil ...Respondent

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరు పిటిషనులో 1వ పిటిషనరుకు భర్త మరియు 2 to 4 పిటిషనర్లుకు తండ్రి అయిన లేట్ యర్రమాక వెంకటసుబ్బారెడ్డికి తేది 1.07.2018దిన మరియు 17.4.2018దిన కనగలూరు గీతానాడ్ వ్రాసి ఇచ్చిన ప్రామిసరీ నోట్లుకు సంబంధించిన గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో దావా నంబరు 131/2022 దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావా పరిహారమును మరియు తేది 12.02.2018దిన కనగలూరు గీతానాడ్ అదుమానము పెట్టి 2,00,000 రూపాయలు సదరు బాకీ నిమిత్తం గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో O.S.NO. 289/2024 దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావా పరిహారమును మరియు తేది 4.1.2020దిన గజ్జల వీరయ్య వ్రాసి ఇచ్చిన ప్రామిసరీ నోటీసు సంబంధించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో O.S.No. 24/2023 దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావా పరిహామును మరియు తేది 18.3.2020 షేక్ గులామ్ గౌస్ వ్రాసి ఇచ్చిన ప్రామిసరీ నోటుకు సంబంధించి గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో దావా నంబరు 25/2023 దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావా పరిహామును కోరుచూ దావాలు దాఖలు చేసి ఉన్నారు. వాటికి సంబంధించి సక్సేషన్ సర్టిఫికేట్ కొరకు పిటిషనరులు పై కోర్టులో పిటిషను దాఖలు చేసి యున్నారు. సదరు పిటిషనులో ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేది 27.06.2025ది పై వారి కోర్టులో ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది.

ఇట్లు

P.GOPAL REDDY

P. NARENDRA

పిటిషనర్లు తరపు న్యాయవాదులు, గూడూరు.